క్లుప్తంగా

పౌష్టికాహారం తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ కొండమ్మ

విజయనగరం ఫోర్ట్: బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. పట్టణంలోని దాసన్నపేట గర్ల్స్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే రక్తహీనత, పౌష్టికాహార లోపం బారిన పడే అవకాశం ఉందన్నారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నెలసరి సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రత్నం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పూసపాటిరేగ: ఈ నెల 18 నుంచి నవంబర్ 16 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తాడ్డి గోవింద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న పోరాం, 19న లోవజగన్నాథపురం, 21న కామవరం, 22న తొత్తడాం, 23న పూసపాటిపాలెం, 24న కొప్పెర్ల, 25న నడిపల్లి, 26న పేరాపురం, 28న కనిమెల్ల, 29న పసపాం, 30న అల్లాడపాలెం, నవంబరు 2న పాలంకి, 5న కనిమెట్ట, 6న రోలుచప్పిడి, 7న చింతపల్లి, 8న సీహెచ్ అగ్రహారం, 11న కోనయ్యపాలెం, 12న ఎల్‌పీ పాలెం, 13న బొర్రవానిపాలెం, 14న భరిణికాం, 15న కొవ్వాడ, 16న కృష్ణాపురం గ్రామాలలో సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చండీయాగంను స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలును, ప్రసాదం అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.


ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్దన్ నాయుడు

విజయనగరం అర్బన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రాంగణంలో గురువారం ఆదికవి వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జనార్దన్‌నాయుడు మాట్లాడుతూ, వాల్మీకి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇలా అయితే రోగాలు రావా..?



రామతీర్థంలో సీసీ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారి నుంచి రామతీర్థం బోడికొండకు వెళ్లే రహదారిలో మురుగు నీరు సీసీ రహదారిపైనే ప్రవహిస్తోంది. కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లల్లో వాడకం నీరు సీసీ రహదారి మీదుగా ప్రవహించి ప్రధాన రహదారిపై నిల్వ ఉంటోంది. దీంతో ఇటు ప్రయాణికులు, అటు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు బయటకి పోయే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. స్థానిక వనంగుడి ఆవరణలో పసుమర్తి కనకమహాలక్ష్మి, తాత్రాజు సత్యనారాయణ గురువారం రాత్రి ప్రదర్శించిన ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. అలాగే కాకినాడ మాధపట్నానికి చెందిన టి.పవన్‌కుమార్ సారథ్యంలో నిర్వహించిన తోలు బొమ్మలాట ప్రదర్శన అలరించింది. చదురుగుడి ఆవరణలో కొంకెపూడి అనూరాధదేవి గానమంజరి ఆకట్టుకుంది. కొండకరకానికి చెందిన రెడ్డి ఆదినారాయణ, పాలవలస గ్రామానికి చెందిన వి.చంద్రరావు ఏకపాత్రాభినయాలు అలరించాయి. అనంతరం కళాకారులను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు సత్కరించారు.

విద్యార్థులకు అపార్ కార్డులు..

- వివరాలు నమోదు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలు
- ముందుగా 9, 10 తరగతుల విద్యార్థుల వివరాల సేకరణ



పాఠశాల విద్యార్థులు

విజయనగరం:

ఆధార్ తరహాలో విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డులు జారీ చేయనున్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికీ అపార్ అందించనున్నారు. వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ అపార్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థికీ గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది.

తప్పనున్న అవస్థలు

ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విజయనగరం జిల్లా కేంద్రంలో గల ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ, కేంద్రియ విశ్వవిద్యాలయంతో పాటు వివిధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ చదువుతున్నారు. రాష్ట్ర నిబంధనల ప్రకారం ఇక్కడి విద్యార్థులకు మాత్రమే ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు ఇప్పటివరకు ఇబ్బంది పడేవారు. వారంతా సొంత రాష్ట్రాల్లో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయాలనుకుంటే చదువుతున్న ప్రాంతంలో ధ్రువపత్రాలు తీసుకురావాలి. దాంతో చాలా మంది విద్యార్థులు అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి తిరగాల్సి వచ్చేది. అపార్ కార్డుల జారీతో కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ వెబ్‌సైట్‌లో పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థుల ప్రవేశాలు, టీసీలు జారీ చేస్తున్నారు. ఇదే తరహాలోనే ఇకపై అపార్ ద్వారా అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తారని మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ ఆనందమూర్తి తెలిపారు. నియోజకవర్గంలో చదువుతున్న 46 వేలకు పైగా విద్యార్థుల వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎక్కడి నుంచైనా ప్రవేశాలు

'అపార్'తో ఎక్కడి నుంచైనా ప్రవేశాలు పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు సంఖ్య ఆధారంగా అపార్ కార్డులో విద్యార్థి బ్యాంకు ఖాతా నంబరు, డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఈ కార్డులను జారీ చేసే ముందు కేంద్ర ప్రభుత్వ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ)ని ప్రారంభించింది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో సహా అపార్ కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ, తదితర పనుల్నీ సులువుగా పూర్తవుతాయి. ఇకపై ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో అపార్ కీలకం కానుంది.

ఒక్క స్కాన్‌తో అన్ని వివరాలు

అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్య, మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాల వివరాలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలన్నీ ఉంటాయి. స్కాన్ చేయగానే మొత్తం వివరాలను తెలుసుకునేలా దీన్ని రూపొందించారు. ముందుగా 9-12 తరగతుల వారికి ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో 9, 10 తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు ఈ కార్డులు జారీ చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేశారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



పూసపాటిరేగ: గులివిందలపేటలో తారురోడ్డు నిర్మాణ శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు



డెంకాడ: డి.కొల్లాంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు



నెల్లిమర్ల రూరల్: కొత్తపేటలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు, గ్రామపెద్దలు

పూసపాటిరేగ : గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని చౌడువాడ, గులివిందలపేట గ్రామాల్లో గురువారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తారురోడ్డు నిర్మాణాలకు భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లె పండుగ పేరిట ఉపాధిహామీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఆమెతో పాటు ఏపీ మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కె. బంగార్రాజు, ప్రత్యేక అధికారి బి. శాంతకుమారి, ఎంపీడీఓ ఎం. రాధిక, ప్రజాప్రతినిధులు మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, సర్పంచ్ బాలా రామలక్ష్మి, బాలా అప్పలరాజు, దంగుడుబియ్యపు సునీత, మహంతి శివ, బి.దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు..

డెంకాడ: మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని మోపాడ, మోదవలస, బంగార్రాజుపేట, డి.కొల్లాం, గుణుపూరు, డెంకాడ గ్రామ పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ కంది చంద్రశేఖర్, ఎంపీడీఓ వై.భవానీ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయం

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి పి.కూర్మినాయుడు అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో పల్లెపండుగలో భాగంగా పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. గ్రామ సందర్శనలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, నాయకుడు గురాన చక్రధర్, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి



చింతపల్లిలో సముద్రతీరం

- తహసీల్దార్ తాడ్డి గోవింద

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తాడ్డి గోవింద సూచించారు. వర్షాల కారణంగా కొత్తనీరు సముద్రంలోకి చేరడంతో కడలి అల్లకల్లోలంగా మారుతోందని ఒక ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉంటే అలల ఉధృతికి సముద్రం నీరు ముందుకు రావడంతో తీరం కొన్నిచోట్ల కోతకు గురైంది. తీరంలో ఉన్న పడవలు, వలలను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, పతివాడ బర్రిపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ , తిప్పలవలస, కోనాడ గ్రామాల మత్స్యకారులు మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి

- అన్నమయ్య జానపద కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న అన్నమయ్య జానపద కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుత సమాజంలో సంప్రదాయబద్ధ కళలను, కళాకారులను పరిరక్షించుకోవాలని అవసరం ఎంతైనా ఉందని అన్నమయ్య జానపద కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి అన్నారు. మండలంలోని రామతీర్థం కల్యాణ మండపం ఆవరణలో భజన మండలి, కోలాట బృందాల సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైందవ మతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాల్లో భక్తి భజనలు, కోలాటాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి శనివారం ఆయా దేవాలయాల్లో భజనలు చేసుకునే అవకాశం కల్పించి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. రామతీర్థంలో నిత్యన్నప్రసాదం 50 మందికి మాత్రమే పరిమితం చేస్తున్నారని.. వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేయాలన్నారు. అనంతరం భక్తజన బృందాలతో నూతన కమిటీని ఏర్పాటు చేసి పలు కీలక విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరావు, గొర్లి రామునాయుడు, పతివాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

13వ డివిజన్‌లో వార్డు పర్యటన



వార్డు పర్యటనలో అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, తదితరులు

విజయనగరం: వార్డు పర్యటనలో భాగంగా కార్పొరేషన్ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు 13వ డివిజన్‌లో గురువారం పర్యటించారు. ఆంజనేయస్వామి ఆలయం జంక్షన్ నుంచి ప్రారంభమైన వార్డు పర్యటన వివిధ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను అధికారులకు వివరించారు. కాలువలు సరిగా లేవని, పూడికలు పెరిగిపోయాయని ఫిర్యాదు చేశారు. దీంతో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గుర్తించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వార్డు పర్యటనలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను కూడా పరిశీలించామన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, ఇంజినీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిరిమానుకు పూజలు ..



పైడితల్లి అమ్మవారి ఉత్సవంలో భాగంగా సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవం ముగిసి మూడు రోజులవుతున్నా నేటికీ భక్తులు సిరిమానుకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. గురువారం పలువురు భక్తులు సిరిమానును దర్శించుకున్నారు. అలాగే అక్కడుండే కొంతమంది మహిళలు భక్తులకు సిరిమాను చెక్కలను విక్రయించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

సింగిల్ విండో విధానంలో అనుమతులివ్వాలి

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



విలేకరులతో మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ

విజయనగరం ఫూల్‌బాగ్: సింగిల్‌విండో విధానంలో వెంటవెంటనే అనుమతులు మంజూరు చేసినప్పుడే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు చాలా మంది యువత సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అయితే పొల్యూషన్, పరిశ్రమల శాఖ, విద్యుత్ శాఖ, ఫైర్, రెవెన్యూ, జీఎస్టీ శాఖల అనుమతుల కోసం తిరగలేక వేరే ప్రాంతానికి తరలిపోతున్నారన్నారు. నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి జిల్లాలో ఒక ఐఏఎస్ అధికారిని నియమించి, సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రతి నియోజకవర్గంలో విద్యుత్, ట్యాక్స్ రాయితీలు కూడా ప్రకటించాలన్నారు. సమావేశంలో పౌర వేదిక జిల్లా కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు, తుమ్మగంటి రామ్మోహన్, చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

జూట్ మిల్లు తెరిపించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

నెల్లిమర్ల: స్థానిక జూట్ మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కనకల పద్మనాభం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మిల్లు మూతబడి ఆరు నెలలు కావడంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వెంటనే మిల్లు తెరిపించడంతో పాటు కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు, రిటైర్డు కార్మికులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు..



దేవుని నెలివాడ రాజరాజేశ్వరి ఆలయంలో చోరీకి పాల్పడుతున్న యువకుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గడిచిన నెల రోజుల నుంచి రామతీర్థం, నెలివాడ గ్రామాల్లో గుర్తుతెలియని దుండగులు తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సరిగ్గా 20 రోజుల కిందట పలువురు ఆకతాయిలు ఇళ్ల ముందు పెట్టిన ద్విచక్రవాహనాల్లో పెట్రోల్ దొంగలించారు. అలాగే కోళ్లు, విలువైన సామాగ్రిని సైతం దొంగలించారని రామతీర్థం గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. నెల రోజుల కిందట దేవుని నెలివాడ గ్రామంలో ఓ వండ్రంగి షాపులో రూ. లక్ష విలువైన పరికరాలను ఎత్తుకువెళ్లారు. అదే గ్రామంలో ఇటీవల తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.లక్ష నగదు, సుమారు 15 గ్రాముల బంగారాన్ని దోచుకున్నారు. ఈ సంఘటన మరువక ముందే రెండు రోజుల కిందట దేవుడి గుడిని సైతం విడిచిపెట్టలేదు. నెలివాడ రాజరాజేశ్వరి ఆలయంలోకి చొరబడిన ఓ నిందితుడు హుండీలో ఉన్న డబ్బులను చాకచక్యంగా దొంగలించుకుపోయాడు. గతంలో కూడా ఈ ఆలయానికి సంబంధించి 40 ఇత్తడి గిన్నెలు అపహరించారని నిర్వాహకులు తెలిపారు. వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తమకు రక్షణ కల్పించాలని వారంతా కోరుతున్నారు.

కామాక్షి ఆలయంలో హోమాలు



అమ్మవారి సన్నిధిలో హోమాలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో తిథి మండల దీక్షలను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక హోమాలు చేపట్టారు. అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ నిర్వహించిన అనంతరం శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. కామాక్షి అమ్మవారి సన్నిధిలో షోడష కళారాధన, శ్రీ చక్రార్చన జరిపించారు. చండీ సప్తపతి పారాయణ, లలితా హోమం, వివిధ పరిహార దేవతా హోమం, నవగ్రహ హోమం, లఘు పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.